

పీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీ ఎప్పుడు..?



- 10వేల పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం హామీ
- 20 ఏళ్లుగా ఎస్జీటీల ఎదురుచూపులు
- మంచిర్యాలలో పదోన్నతికి నోచుకోని ఉపాధ్యాయులు
- ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వేడుకోలు

మంచిర్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో దీర్ఘ కాలికంగా నెలకొన్న అనేక సమస్యలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి కారణంగా పరిష్కారానికి నోచుకోలేదు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, తెలంగాణలో 2వ పీఆర్సీ, పెండింగ్ డీఏల ప్రకటన, ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్‌హెచ్ఎం పోస్టుల భర్తీ వంటి అనేక సమస్యలకు పరిష్కారం చూపకపోవడంతో విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత విద్యారంగంపై దృష్టిసారించడంతో ఉపాధ్యాయ లోకానికి ఊరట లభించినట్లయింది. రెండో దఫా పదోన్నతుల ప్రక్రియ సైతం కొనసాగుతోంది. ప్రస్తుత ప్రభుత్వం భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ చేపట్టడంతో అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆయా విభాగాలకు చెందిన ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,479 పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించి, ఆ దిశగా చర్యలు కూడా చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భాషా పండితులు, పీఈటీల పదోన్నతి ప్రక్రియ కూడా పూర్తికాగా, గ్రేడ్-1 స్థానం లభించింది.

● స్థానం దక్కని ఎస్జీటీలు...

రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న ప్రభుత్వం... సెకండరీగ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీలు)కు మాత్రం స్థానం కల్పించకపోవడంతో వారంతా తీవ్ర నిరాశలో ఉన్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్జీటీలకు మళ్లీ స్థానం కల్పించడం లేదు. భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులలో 90 శాతంపైగా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. అతి కొద్దిమంది మాత్రమే అర్హతలు లేని కారణంగా మిగిలిపోయారు. ఈ పోస్టులే కాకుండా అప్‌గ్రేడ్ చేయడం కంటే ముందున్న సుమారు వెయ్యి భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు, ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ వాటిపైన దృష్టి సారించడం లేదు. జీవో 11, 12లను సవరించి అర్హులైన ఎస్జీటీలతోపాటు భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులతో కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు కల్పిస్తే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. ఆ దిశగా ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయకపోవడంతో అర్హులైన ఎస్జీటీ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మరోవైపు 2017, 2024డీఎస్సీల ద్వారా నియామకమైన గ్రేడ్-2 భాషాపండితులు సైతం స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే అవకాశం ఉండటంతో 25 ఏళ్లకుపైగా సర్వీసు ఉన్నప్పటికీ అర్హులైన ఎస్జీటీలకు మాత్రం పదోన్నతులు రావడం లేదు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ఎస్జీటీలకు అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో మొండిచేయి చూపి, తమకు రావలసిన...

(మిగతా 7లో)



గూడెం వద్ద గోదావరి ప్రవాహం

గోదావరి పరవళ్లు..

దండేపల్లి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 39గేట్లు ఎత్తి నీటిని గోదావరికి విడుదల చేశారు. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టు నుంచి నీటిని గోదావరికి వదలడంతో గూడెం గోదావరి నదికి వరద నీరు ఉధృతి పెరిగింది.

● **నస్పూర్ (ఆంధ్రజ్యోతి):** ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులు నిండిపోయి గేట్లను ఎత్తడంతో దిగువన గల నస్పూర్ తీర ప్రాంతంలో గోదావరి పరవళ్లు తొక్కుతోంది. నస్పూర్ తీరంలోని గంగా దేవి ఆలయంలోకి, పొలాల్లోకి వరదనీరు చేరింది. గోదావరి నది తీరం వైపునకు ఎవరు వెళ్లకుండా పోలీసులు జాగ్రత్తలు చేపట్టారు.

● వేలాల పుష్కరఘాట్‌ను ముంచెత్తిన వరద

జైపూర్ (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరదతో గోదావరి నది పొంగి పొర్లుతోంది. బుధవారం తెల్లవారేసరికి వేలాల పుష్కరఘాట్, పొలాలు, పత్తి చేన్లలోకి వరద నీరు చేరింది. సుందిళ్ల బ్యారేజీ మీదుగా గోదావరినదిలో వచ్చి చేరుతున్న భారీ వరదతో గోదావరినది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్ఐ శ్రీధర్‌లు వేలాల పుష్కర ఘాట్‌ను బుధవారం సందర్శించి నీటి ఉధృతిని పరిశీలించారు.

కోటపల్లి: మండలానికి ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని రాంపూర్, దేవులవాడ సమీపంలోని పత్తి చేన్లు, పంట పొలాలు మరో మారు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఐటీఐ విద్యార్థులు టాటా టెక్నాలజీస్, స్కిల్స్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లను (ఏటీసీ) వినియోగించుకొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ సుందర్‌కుమార్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏటీసీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ మిషనరీకి సంబంధించి నైపుణ్యాభివృద్ధి చేసుకోవాలని అప్పుడే అన్నిరంగాల్లో విద్యార్థులు రాణిస్తారన్నారు. ఏటీసీ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు పరిశ్రమలు, నిర్మాణ రంగంలో ఉద్యోగాలులేక ఎంతో అవకాశం లేక విద్యార్థులు నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు. టెక్నాలజీని ఉపయోగించి నప్పుడే ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు జిల్లాస్థాయి, డివిజనల్ స్థాయిలో అందుబాటులోకి తెచ్చినందుకు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్, దస్తగిరి, శ్రీధర్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌తో విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

నెన్నెల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకొని సత్వరం పరిష్కరించేందుకే గ్రీవెన్స్‌లు నిర్వహిస్తున్నామని ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్-2) టెక్నికల్, ఫైనాన్స్ మెంబర్లు సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ప్రాంతంలోని ఎనిమిది సబ్‌స్టేషన్లలో ఎక్కడ సమస్య వచ్చినా, నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోంతోందని, నెన్నెలలో 132కేవీ సబ్‌స్టేషన్ నిర్మించి, అన్నింటికి ప్రత్యేక లైన్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు వారి దృష్టికి తీసుకెళ్లారు. పలు సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని అన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాజీపడేది లేదన్నారు. విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటరు ఆగిపోవడం, కాలిపోవడం, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసులు, అదనపులోడు ఇవ్వడంలో నిర్లక్ష్యం, జాప్యం, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు, ఓవర్‌లోడ్, కాలిపోవడం, తరలించడం, ఎల్‌టీ కేటగిరి, ఫేజ్ మార్పడం తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఈమొయిల్, వాట్సాప్ ద్వారా కూడా సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. సేవలకు గరిష్ట కాలపరిమితులు ఉన్నాయని, ఆలోగా ఫోరం సభ్యులు సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తారని అన్నారు. సీజీఆర్ఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈఈ ఉత్తం జాడే, బెల్లంపల్లి డీఈఈ బానోతు రాజన్న, రూరల్ ఏడీఈ రవికుమార్, డివిజన్‌లోని ఏఈఈలు, సబ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీజీఆర్ఎఫ్ సభ్యులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు

రసవత్తరంగా 'ఓరియంట్' ఎన్నికలు

- 29న గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్

7

భూభారతి దరఖాస్తులను వేగవంతం చేయండి

భీమిని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులను వేగవంతం చేసి తక్షణమే పరిష్కరించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. అనంతరం మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామానికి చేరుకోని గ్రామానికి చెందిన గొనుకుల రమేష్‌కు చెందిన భూమిని బాధితుడు ఫిర్యాదు మేరకు సర్వే నంబరు 312పోడు భూమిని పరిశీలించారు. ఈ భూమి గ్రామానికి 4కి.మీ దూరంలో ఉండి బురదమయంగా ఉండటంతో ట్రాక్టరుపై ఎక్కి మోఖా విచారణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బికర్ణ దాస్, ఆర్ఐ వెంకటేష్ గ్రామస్థులు, రెవెన్యూసిబ్బంది ఉన్నారు.

దోమకాటు వ్యాధులపై అవగాహన

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫీవర్ వార్డులో రోగులకు దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణపై డాక్టర్ శివ ప్రతాప్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు బుధవారం అవగాహన కల్పించారు. పగటిపూట కుట్టే దోమలవల్ల డెంగ్యూ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సంతోష్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, సిబ్బంది, సూపర్ వైజర్ పాల్గొన్నారు.

మొబైల్ ఫోరెన్సిక్ వాహనంతో సత్వర దర్యాప్తు



మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నేరానికి సంబంధించిన సంఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలు సేకరించే ఫోరెన్సిక్ విభాగం వల్ల సత్వర దర్యాప్తు జరుగుతుందని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కమిషనరేట్ కార్యాలయంలో మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫోరెన్సిక్ మొబైల్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చి ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేసిందన్నారు. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని పోలీసులకు మరింత మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. ఏదైన నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగ్‌ప్రింట్ అధికారులు, సిబ్బంది మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకుంటారన్నారు. సంఘటన స్థలం నుంచి రక్తమరకలు, వేలి ముద్రలతో ఇతర సాక్ష్యాధారాలను సేకరించి మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ఏవో శ్రీనివాస్, ఏఆర్ఏసీపీ ప్రతాప్, రామ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ఎఫ్ఎస్ఎల్ మంచిర్యాల, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 22వ తేదీన ఉదయం 10.30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీఆర్యవర్త ఇన్ఫోటెక్ సంస్థలో మంచిర్యాల ప్రాంతంలో 100 ఎక్స్ఎంఎల్, ఈపీయుబీ ప్రోగ్రామర్ పోస్టులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి ఏదైనా డిగ్రీ చేసిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9949084387, 9963452486 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ స్తంభాలకు కట్టిన కేబుల్ వైర్లు తొలగింపు

నస్పూర్, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ వద్ద విద్యుత్ స్తంభాలకు కట్టిన కేబుల్ టీవీ, ఇంటర్నెట్ కేబుల్స్‌ను విద్యుత్‌శాఖ ఏఈ రాంచందర్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వఆదేశాల మేరకు పట్టణంలోని విద్యుత్‌స్తంబాలకు కట్టిన కేబుల్స్‌ను కట్ చేశామని ఏఈ రాంచందర్ తెలిపారు. ఇంటర్నెట్, కేబుల్‌నెట్‌వర్క్స్ సంబందించిన కేబుల్స్‌ను విద్యుత్ స్తంభానికి ఇష్టారీతిన కడుతున్నరన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగిన పద్ధతిలో కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఫోర్‌మెన్ పాపాలాల్, లైన్ ఇన్‌స్పెక్టర్ ధరణి రమేష్, లైన్ మెన్ సతీష్, కోటేష్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

లక్సెట్టిపేట, ఆగస్టు, 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జెండవెంకటాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం యశోధర సూచించారు. లక్సెట్టిపేట మండలంలోని చందారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలతో పాటు, వంట గది, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులతో విద్యాబోధనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మధ్యాహ్న భోజనం మెను ప్రకారం అందజేయాలని పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని నిర్వహకులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం, సీఆర్‌పి ప్రణీత్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.



తరగతి గదిలో విద్యావిదానం పరిశీలిస్తున్న హెచ్ఎం యశోధర

గూడెంగుట్ట ఆలయ సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్



దండేపల్లి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెంగుట్ట సత్యనారాయణస్వామి దేవస్థానం సూపరింటెండెంట్‌గా బి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యదేవుడిని దర్శించుకున్నారు. ప్రస్తుత సూపరింటెండెంట్ కె చంద్రశేఖర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని కాళ్వేరముక్తేశ్వస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న శ్రీనివాస్ గూడెం సత్యనా రాయణ స్వామి దేవస్థానానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

గోదావరి తీరం వద్ద బందోబస్తు నిర్వహించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, గోదావరినది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరి నది తీరం వైపు ఎవరు వెళ్లకుండా బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నది తీరాలకు ఎవరు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. అధికారులు జిల్లాలో వరద పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలన్నారు. తక్షణ సహాయం కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి 24గంటలు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. అనంతరం మాతాశిశు ఆసుపత్రిని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పారిశుధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. వార్డుల్లో రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తూ అపరిశుభ్రం చేసే వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కాలేజీ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను, పాత మంచిర్యాలలో నిర్మిస్తున్న మహిళా శక్తి భవన్ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు భీష్మ, శ్రీధర్, తహసీల్దార్ రఫతుల్లా, సీఐ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల కాలేజీ రోడ్డులోని గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

రహదారుల మరమ్మతు పనులను చేపట్టాలి

భీమారం (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. భీమారం మండలంలోని బూరుగుపల్లి నుంచి దాంపూర్‌కు వెళ్లే దారిలో గర్రెపల్లి సమీపంలో దెబ్బతిన్న రహదారిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను పరిశీలించి త్వరగా పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించి తరగతిగదులు, రిజిస్టర్లు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. అనంతరం కస్తూర్బాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అదనపుగ దుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచే యాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలి

తాండూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రేచిని గ్రామంలో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ రోడ్లు, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. గ్రామంలో చెత్త వేసే దుకాణదారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువుల తయారీకి ఉపయోగించాలని సూచించారు. వర్షాల దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. అనంతరం మాలవాడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు నమోదును, రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

యువత తోవ.. సామాజిక సేవ



సేవలో భాగంగా ఆలయాన్ని శుభ్రం చేస్తున్న యువకులు(ఫైల్)



తొట్టిలో పక్షులకు నీరు పోస్తున్న యువకుడు(ఫైల్)

సిర్పూర్(టి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన.. భక్తి భావం వైపు పలువురు యువకులు అడుగులేస్తున్నారు. నిత్య జీవితంలో వివిధ ఒత్తిళ్లతో గడుపు తున్నప్పటికీ కొంత సమయం కేటాయిస్తూ సామాజిక సేవ చేసేందుకు ముందుకు వస్తున్నారు. తమ లాంటి ఆలోచన ఉన్న వారిని కలుపుకుని ముందడుగేస్తున్నారు. కేవలం దేవుడుకి పూజలు చేయడమే కాదు. ఇది సమజా సేవలోనూ ప్రతిబిం బించాలని నిర్ణయించుకుని ఆచరణలో చూపిస్తూ అందరికి ఆదర్శకంగా నిలుస్తున్నారు.

సిర్పూర్(టి) గ్రామానికి చెందిన యువకులు. సాధారణంగా ఆదివారం వస్తే చాలామంది యువత సరదాగా గడి పేందుకు నిర్ణయించుకుంటారు. దానికోసం ఎదురుచూస్తున్న వారు కూడా ఉంటారు. కానీ అలాంటి సరదాలకు దూరంగా ఉంటున్నారు సిర్పూర్(టి)కి చెందిన యువకులు. స్వచ్ఛ మందిరం నినాదంతో చేతుల్లో చీపుర్లు, సంచులు పట్టుకొని గ్రామాల్లోని ఆలయాల పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. సనాతన ధర్మ యువసైన్యం పేరుతో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. దీనిలో దాదాపు 50మంది సభ్యులు ఉన్నారు. దీని ద్వారా ఆలయాలే కాకుండా పర్యవరణ పరిస్థితులోనూ తమవంతు బాధ్యతను సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఆలయాల వద్ద పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, వినియోగించిన పూజాసామగ్రి అవశేషాలు, ఇతర అపరిశుభ్రతను తొలగిస్తూ కొత్త శోభను తీసుకువస్తున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సైతం పాల్గొంటూ అండగా నిలుస్తున్నారు.

అన్నదానం.. పశువుల దాహార్తి..

యువకులు కేవలం పరిశుభ్రత చర్యలకే పరిమితం కాలేదు. దేవాలయాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లోనూ కీలకపాత్ర పోషిస్తు న్నారు. వంట పనుల నుంచి భక్తులకు ప్రసాద వితరణ వరకు అన్నింటా ముందుండి సేవలందిస్తున్నారు. అంతే కాకుండా వేసవిలో పక్షులు, పశువుల దాహార్తి తీర్చేందుకు రోడ్ల పక్కన అటవీ ప్రాంతాల్లోని నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నారు. వేసవి పూర్తయ్యే వరకు వాటిని నిర్వహిస్తూ అభినందనలు అందుకుంటున్నారు.

కూలీ పనులకు వెళ్తూనే సేవ..



నిత్యం కూలీ పనులకు వెళ్తుంటాను. నా తోటి మిత్రులు చేపడుతున్న ఈ సేవా కార్యక్రమాలను వాట్సప్‌లో చూసి నేను పాల్గొంటున్నా. ప్రతీ ఆదివారం సామాజిక సేవా లేదా దేవాలయాల పరిశుభ్రత చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

- ఆయూష్, సిర్పూర్(టి)

ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం..



నేడు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. గ్రూపు సభ్యులందరితో కలిసి సేవా కార్యక్రమాల్లో పా ల్గొంటా. దీని ద్వారా పని ఒత్తిళ్ల నుంచి ఉపశమనంగా అనిపిస్తుంది. కార్యక్రామల్లో పాల్గొనడం ద్వారా అందరితో సత్సంబంధాలు పెరుగుతాయి.

- గాజిరెడ్డి సంతోష్, సిర్పూర్(టి)

మూడో రోజుకు చేరిన ఎమ్మెల్యే దీక్ష



దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే హరీ‌ష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పోడు సమస్యను పరిష్కరించాలని, జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలని ఎమ్మెల్యే హరీ‌ష్‌బాబు తన నివాసంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష బుధవారం నాటిరి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోడు సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే వారకు దీక్ష కొనసాగిస్తామని తెలిపారు. నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని మంచిర్యాల బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, సీనియర్‌నాయకులు ఆశోక్, బెజ్జూరు చేనేత సహకార సంఘం కార్మికులు, ముత్తంపేట గ్రామస్థులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన కీలక కార్యకర్తలు శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్ రావు, ఆశోక్, చన్నపురి గణపతి, సాంబయ్య, బాల్కశ్యాం, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ ప్రేంకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఉదయం, సాయంత్రం వైద్యులు డాక్టర్ హరీష్ బాబు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. కాగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆరోగ్యం బాగుండాలని కోరుతూ పట్టణ అధ్యక్షుడు ఆర్మీ శివకుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక రాంమందిర్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా దీక్షలు

సిర్పూర్(టి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాల్వాయి హరీ‌ష్‌బాబు దీక్షకు మద్దతుగా బీజేపీ నాయకులు సిర్పూర్(టి) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒక రోజు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు లావణ్య, సత్యనారాయణ, శంకర్, నానయ్య, అశోక్, మహేష్, రంగన్న, అశోక్, సాయి, ప్రశాంత్, బాపు, దివాకర్, శ్యాంరావు, భగవాన్, మనోజ్, రాజశేఖర్, రవి, శ్రీనివాస్, బాలాజీ, లాలాజీ, ధర్మారావు, రాకేష్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు పోరాటం

రెబ్బెన, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయించడమే పీఆర్టీయూటీఎస్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనీల్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో వచ్చే నెల 1న చేపట్టబోయే మహాధర్నా పోస్టర్లను బుధవారం రెబ్బెనలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను సంపూర్ణంగా అంతం చేసేందుకు పీఆర్టీయూ టీఎస్ సంఘం తీసుకుందని తెలిపారు. దశల వారిగా పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఈ ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరా రు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సదానందం, ప్రధాన కార్యదర్శి రేగళ్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జాడి జ్ఞానేశ్వర్, కార్యదర్శి గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కెరమెరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేపట్టి మూడేళ్ల పూర్తియిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమం, అభిషేకం, కలశ పూజ, పూర్ణాహుతి, హోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఎనిమిది జంటలు హోమంలో పాల్గొన్నాయి.

రైతులు అధైర్యపడొద్దు

- పంట నష్టపోయిన వారికి పరిహారం అందజేస్తాం
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరదవల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని అదుకుంటామని, అధైర్య పడొద్దని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కలెక్టరేట్‌లో వరదల వల్ల జరిగిన నష్టాల నివారణపై బుధవారం అధికారులతో సమీక్షించారు. అంతకు ముందు మండలంలోని రాజూరా గ్రామంలో వరదలకు దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో వారం రోజుల్లో కురిసిన భారీ వర్షాల వల్ల ఏర్పడిన నష్టాల నివారణకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదైనందున వాగులు, ఒర్రెలు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయి నష్టం వాటిల్లిందన్నారు. వర్షాల వల్ల జిల్లాలో 6,453 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి స్థాయిలో వరద నష్టాల నివేదికలు సమర్పించాలని అదేశించారు. పంటనష్ట పోయిన పంటలకు ఎకరానికి రూ. 10వేల నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెగిపోయిన రోడ్లు, వంతెనలు, లోలెవల్ వంతెనల వద్ద త్వరితగతిన మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా కూలీన ఇళ్ల గోడల వివరాలను అందించాలని చెప్పారు. జిల్లాలో చనిపోయిన పశువుల వివరాలతో నివేదికలను రుపొందించి సమర్పించాలని సూచించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ భారీ వర్షాలతో జిల్లాలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొవలసి వచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అటవీశాఖ అడ్డు పడుతుందని చెప్పారు. నిర్మాణాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కుమరం భీం ప్రాజెక్టు అనకట్ట దెబ్బ తినడంతో అధికారులు కవర్లు కప్పారని ప్రస్తావించారు. వట్టివాగు ప్రాజెక్టు ప్రదాన కాలువకు గండి ఏర్పడిందన్నారు. దీంతో రైతాంగానికి సాగునీరు అందడంలేదని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. అనంతరం భారీ వర్షాల కారణంగా ఆసిఫాబాద్ మండలంలోని మాలన్ గోంది గ్రామానికి చెందిన సిడాం గంగుకు సంబందించిన మేకలు, గొర్రెలు మృత్యువాత పడడంతో రూ. 1.50 లక్షల ప్రొసిడింగ్‌ను అందజేశారు. కార్యక్రమం లో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఎఫ్‌డీవో సుశాంత్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నియోజకవర్గ ఇన్‌చార్జీ అజ్మీర శ్యాంనాయక్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మాసాదే చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ..

ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని మంత్రికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో అచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని, మెడికల్ కళాశాలకు అచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని పద్మశాలీ సంఘం నాయకులు మంత్రికి విన్నవించారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ. 50వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు మంత్రికి వినతి పత్రం అందజేశారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు బుధవారం ఆసిఫాబాద్‌లో ఐఎన్‌టీయూసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి కార్మిక కుటుంబాలు నివసిస్తున్న కాలనీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరిం పరిష్కరించాలని కోరారు. గోలేటి ఓపెన్‌కాస్టును త్వరగా ప్రారంభించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటి జనరల్ సెక్రటరి ప్రకాష్ రావు, నాయకులు పల్లాస్, సదాశివ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలో గాదె రాజేశ్(26) అనే యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్‌కు భార్య లావణ్య, ఇద్దరు కూతుర్లతో పాటు తల్లి ఉంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేది బీజేపీయేనని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు ఏమాజీ, పోశం, అశోక్, వెంకటకృష్ణ, సతీష్‌రావు, కృష్ణమూర్తి, తిరుపతి, రమణరావు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 108 వాహన సర్వీసులను వినియోగించుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వామాట్ అన్నారు. బుధవారం మండలంలోని అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంబులెన్స్ ఎగ్జిక్యూటీవ్ ఎ సంపత్, ఈఎంటీ రాంబాబు, పైలెట్ నరేశ్ పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలి

జైపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీ కార్మికులకు మెరుగైన వైద్యం అందించేలా ఈఎస్ఐ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ ఆసుపత్రి స్థాపనకు బుధవారం జైపూర్ పవర్ ప్లాంట్ యాజమాన్యం భూమి కేటాయించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెన్నకేశవుల చిరంజీవికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ యూనియన్ దీర్ఘకాలిక పోరాట ఫలితంగా పవర్ ప్లాంట్ కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రిని యాజమాన్యం ఏర్పాటు చేస్తుందని, ఇది బీఎంఎస్ యూనియన్ వల్లనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ కార్యదర్శి కృష్ణ భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, వెంకటేశ్వర్లు, కిషన్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికులకు కనీస పెన్షన్ రూ.1000 ఇవ్వాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మిర్యాల రంగయ్య, కె. సారయ్య, కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, సలహాదారులు దమ్మలపాటి శేషయ్య కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌కు వచ్చిన ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాకు వినతిపత్రం అందించారు. పెన్షన్ పథకం ప్రవేశపెట్టి 27 ఏళ్ల గడిచినా కరువుభత్యం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. పెన్షన్ చట్టాన్ని సవరించి పెన్షనర్లు గౌరవప్రదమైన జీవనం కొనసాగించేందుకు ఏఐటీయూసీ పక్షాన కేంద్ర ప్రభత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

సింగరేణిలో టీబీజీకేఎస్ బలోపేతమే లక్ష్యం



కొప్పుల ఈశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మందమర్రి నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో యూనియన్ బలోపేతం లక్ష్యమని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ అన్నారు. సింగరేణిలో టీబీజీకేఎస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను బుధవారం మందమర్రికి చెందిన టీబీజీకేఎస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడు తూ సింగరేణి ఉద్యోగుల హక్కుల సాధన కోసం తాము ఎలాంటి త్యాగాలకైన సిద్ధంగా ఉన్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పారు. సమాఖ్యపాలనలో స్వరాష్ట్రం కోసం సింగరేణియులు చేసిన సకల జనుల సమ్మె సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డదని అన్నారు దీనితోనే రాష్ట్ర సాధన సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యోగులకు ఇంక్రిమెంట్ ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. కాని ప్రజా పాలనలో సింగరేణి ఉద్యోగులకు తీరని నష్టం జరుగుతుందని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాక ఇంత వరకు లాభాల వాటాప్రకటించకపోవడం దారుణమని ప్రశ్నించారు. సింగరేణిలో యూనియన్‌లో బలోపేతం లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. ఆయనను కలిసిన వారిలో మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, బడికెల సంపత్, బాబురావు, రమణ, ఒడ్నాల రాజమల్లు, దాసరి శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

నూతన గనుల ఏర్పాటుకు పోరు

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుకు రాజీలేని పోరాటం చేస్తామని టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నిక జరుగగా, అనంతరం మాట్లాడుతూ, ఐటీ మినహాయింపు కోసం ఢిల్లీ పర్యటన్, సేవ్ సింగరేణి ఉద్యోమం, రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు రాబట్టుట, లాభాల వాటా కోసం డిమాండ్, కార్మికుల ఇతర సమస్యలపై ఉద్యమించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, మాజీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేష్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు అధిక ఉత్పత్తితోనే అభివృద్ధి



కార్మికులకు బహుమతులు అందజేస్తున్న జీఎం విజయ్‌ప్రసాద్

మందమర్రిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు అధిక ఉత్పత్తితోనే అభివృద్ధి సాధ్యమని, మందమర్రి ఏరియా ఇన్‌చార్జీ జీఎం విజయ్‌ప్రసాద్ అన్నారు. ఏరియాలోని కేకే 5, వర్కుషాప్, జీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మల్టీ డిపార్టుమెంట్ సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. ఏరియాలోనే వందకు వంద శాతం ఉత్పత్తి సాధిస్తున్న గని కేకే 5 గని చెప్పారు. . ప్రతి రోజు 106 శాతం ఉత్పత్తి సాధించడం మామూలు విషయం కాదన్నారు. సింగరేణి బొగ్గుకు మంచి ధర రావాలంటే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. దేశ పరిశ్రమలకు 1500 మిలియన్ టన్నుల బొగ్గు అవసరమని, కానీ ప్రస్తుతం వెయ్యి మిలియన్ టన్నులు మాత్రమే సాధిస్తున్నామన్నారు. దీంతో విదేశీ బొగ్గును కొనేందుకు పరిశ్రమలు ఆసక్తిచూపుతున్నాయని, ఇప్పటికే మనతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని చూస్తు న్నాయన్నారు. ఉద్యోగులు, అధికారులు క్రమ శిక్షణతో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఐక్యంగా పని చేయాలని సూచించారు. అనంతరం కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సంస్థకు సంబంధించి వివిధ ప్రశ్నలు అడగి సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేకే 1 గ్రూపు ఏజెంటు రాంబాబు, గని మేనేజర్ శంభునాద్ పాండే, పీఎం శ్యాంసుందర్, ఐఈడీ ప్రవీణ్‌కుమార్, అధికారుల సం ఘం అధ్యక్షుడు రమేష్, గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కంది శ్రీనివాస్, సంక్షేమాధికారి రవళి తదితరులు పాల్గొన్నారు.



సంస్థ పరిరక్షణలో ఉద్యోగుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ పరి రక్షణలో ఉద్యోగుల పాత్ర కీలకమని ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. సివిల్, సెక్యూరిటీ విభాగాలకు చెందిన ఉద్యోగులకు గురువారం మల్టి డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించగా, జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ ప్రణాళికలను గుర్తించ పనిచేయాలన్నారు. క్వార్టర్ల నిర్మాణం, నిర్వహణ, ఇతర పనుల్లో సివిల్ విభాగం ఉద్యోగుల కృషి ఎంతో ఉందన్నారు. సంస్థ ఆస్తులను కాపాడడంలో సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు ముందుంటారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అధికారుల నిరసనలు

మందమర్రిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అధికారుల శాంతియుత నిరసనలు కొనసాగుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూగత కొన్ని రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. బుధవారం కేకే 5 గని వద్ద అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో 2022-23 పీఆర్‌సీని వెంటనే చెల్లించాలని, ఉచిత విద్యుత్ బిల్లులు చెల్లించాలని, ఐఐఎం, ఐఐటీలలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, ప్రమోషన్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధికారులు రాంబాబు, శంకరయ్య, శంభునాథ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిరేవు, నాగసముద్రం, కొండాపూర్, రెబ్బనపల్లి, నంబాల ప్రీ ప్రైమరీ పాఠశాలలోని ఇన్‌స్ట్రక్టర్, ఆయాగా పని చేసేందుకు అర్హత గల మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇన్‌స్ట్రక్టర్ కోసం కనీస అర్హత ఇంటర్మీడియేట్ ఆదే గ్రామానికి చెందిన మహిళ అయి ఉండాలన్నారు. ఆయాల పోస్టు ఏడో తరగతి పాసై అదే గ్రామానికి చెందిన మహిళ అర్హులని తెలిపారు. ఈనెల 22లోగా దండేపల్లి మండల విద్య వనరుల కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో సూచించారు.

జన్నారం: మండలంలోని పొన్కల్, అక్కెపల్లిగూడెం, కిష్టాపూర్, జన్నారం ప్రాథమిక పాఠశాలలో ప్రీప్రైమరీ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్, ఆయాలుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో విజయ్ కుమార్ తెలిపారు.

హాజీపూర్: మండలంలోని నంనూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రీప్రైమరి బోధకులు, ఆయాగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి పోటు తిరుపతిరెడ్డి ప్రకటన లో తెలిపారు.

తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

తాండూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో యువతీ, యువకులకు తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 సాయంత్రం 5 గంటలలోగా గోలేటిలోని ఈఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో దరఖాస్తులు అందించాలన్నారు. వివరాల కోసం 9951214116లో సంప్రదించాలన్నారు.

ఫుడ్ స్టాల్స్ ఏర్పాటుకు దరఖాస్తులు

శ్రీరాంపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వార్షికోత్సవ రక్షణ బహుమతుల ప్రదానోత్సవం ఈనెల 30న శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహిస్తున్నారు. ఫుడ్ స్టాల్స్ పెట్టుకునేందుకు అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా జీఎం కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.



రసవత్తరంగా 'ఓరియంట్' ఎన్నికలు

- 29న గుర్తింపు సంఘం ఎన్నికల పోలింగ్
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కాసిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓరియంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఎమ్మెల్యేలు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు వర్గాలు పోటీ చేస్తుండడంతో ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఓరియంట్ ఎన్నికల ప్రక్రియ ఇప్పటికి నాలుగుసార్లు వాయిదాపడుతూ వస్తుంది. ఇందులో ఇరువర్గాలు వివిధ కారణాలతో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించడం వల్ల ఎన్నికల నిర్వహణపై కార్మికు లకు, డీసీఎల్ అధికారుల మధ్య స్పష్టత కొరవడింది. ఎట్టకేలను ఆ నెల 29న ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారలు ఏర్పాట్లు చేస్తున్నారు.

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తండ్రి దివంగతనేత కొక్కిరాల రఘుపతి రావు ఓరియంట్ కార్మికసంఘం అధ్యక్షుడిగా పనిచేసి కార్మికవర్గంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తండ్రి వారసత్వాన్ని మళ్లీ ఓరియంట్‌లో కొనసాగించేందుకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు తమ్ముడు కొక్కిరాల సత్యపాల్‌రావును ఓరియంట్ ఎన్నికల బరిలో నిలిపాడు. కానీ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, చెన్నూర్ ఎమ్మెల్యే, కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌లు కలిసి అనూహ్యంగా కార్మిక సంఘం దివంగత నేత పుస్కూరి వెంగళ్‌రావు వారసత్వాన్ని బలపరుస్తూ పూస్కూరి విక్రమ్‌రావును తెరపైకి తేవడంతో ఓరియంట్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. కొక్కిరాల సత్యపాల్‌రావు తండ్రి దివంగత రఘుపతిరావు, యూనియన్ ఓరియంట్ సిమెంట్‌స్టాఫ్‌అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌పై పోటీ చేస్తున్నారు. ఇటీవల కొత్తగా స్థానిక ఆదివాసీలు ఏర్పాటు చేసిన లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయిమెంట్ వర్కర్స్ యూనియన్‌పై పుస్కూరివిక్రమ్‌రావు పోటీ చేస్తు న్నారు. బరిలో ఉన్నది సత్యపాల్‌రావు, విక్రమ్‌రావులే అయినప్పటికీ పోటీ మాత్రం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మధ్యనే అన్నట్లు ప్రచారం జరుగుతోంది.

● హైకోర్టు ఉత్తర్వులతో...

నాలుగున్న దశాబ్దాల కాలంలో నిర్వహించిన ఓరియంట్ ఎన్నికలు, ఓరియంట్ ఎన్నికల అభ్యర్థులు హైకోర్టు మెట్లెక్కిన సందర్భాలు లేవు. కాని ఇప్పుడు జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికలు హైకోర్టు డైరెక్షన్‌లో నిర్వహించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 250మంది ఓటర్లు ఉన్న(కార్మికులు) ఓరియంట్‌లో ఎన్నికల నిర్వహణ అధికారులను సైతం హడలెత్తిస్తుంది. 23సార్లు ఎన్నికలపై నోటిఫికేషన్లు విడుదల చేసిన కార్మికశాఖ అధికారులు నాలుగు సార్లు ఎన్నికలను వాయిదా వేశారు. జనవరి 18న మొదలైన ఎన్నికల ప్రక్రియలో జూన్ 5న, జులై 11, జులై 18తో పాటు ఆగస్టు19న నిర్వహిస్తామన్న ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. చివరిగా ఈనెల 29న గుర్తింపుసంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో డీసీఎల్ అధికారులు ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

● తొమ్మిది ఓట్లపై వీడిన చిక్కుముడి...

ఓరియంట్ కంపెనీలో 257 మంది ఓటర్లతో పాటు 9 మంది ట్రైనీ కార్మికులు ఉన్నారు. వీరికి ఓటు హక్కు కల్పించాలని కొందరు వాదిస్తుండగా మరొక్కవర్గం ట్రైనీలకు ఓటు హక్కు కల్పించవద్దని కోర్టును ఆశ్రయించారు. 90 రోజులు పని పూర్తిచేసిన కార్మికులకు కార్మిక చట్టాల ప్రకారం ఓటు హక్కు కల్పించాలని మరోవర్గం కోర్టును ఆశ్రయించింది. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తొమ్మిది మంది ఓట్లను సీల్డ్ కవర్‌లో ఉంచి 257 మంది ఓట్లను ముందుగా లెక్కించాలని కోర్టు సూచించింది. వాటితోనే గెలుపుపోటములు ఫలితాలు తేలితే ఈ తొమ్మిది ఓట్లను పరిగణలోకి తీసుకోరాదు. 257ఓట్లతో ఫలితం తేలని పక్షంలో తొమ్మిది ఓట్లను పరిగణలోకి తీసుకొని లెక్కించాలని న్యాయం స్థానం తెలిపినట్టు అధికారులు తెలిపారు. దీంతో తొమ్మిది ఓట్ల చిక్కు ముడి వీడిపోయింది. ఈనెల 29న ఓరియంట్‌లో జరిగే గుర్తింపుసంఘం ఎన్నికల విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

పీఎస్ హెచ్‌ఎం పోస్టుల భర్తీ ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

పదోన్నతులను దూరం చేశారని, అర్హతగల ఎస్జీటీలు వాపోతున్నారు. గతంలో కామన్ సీనియారిటీతో పదోన్నతులు తీసుకున్నప్పటికీ అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో సంఘాలు ఎస్జీటీలకు మొండి చేయి చూపాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. అప్ గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయి, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ పదోన్నతులు పొందినప్పటికీ, ఎస్జీటీలకు తదుపరి అవకాశం కల్పిస్తూ జీవో సవరించడంలో కృషి చేయడంలేదని, రాష్ట్రప్రభుత్వ నిర్ణయంతో ఎస్జీటీలు ప్రభుత్వంతోపాటు యూనియన్లపై ఆగ్రహంతో ఉన్నారు. అప్‌గ్రేడేషన్‌లో అర్హత కలిగిఉన్నందున ఎస్జీటీలు తమకు కూడా అవకాశం కల్పించాలని పోరాటం చేస్తున్నారు. అప్‌గ్రేడేషన్ కంటే ముందున్న ఖాళీగా ఉన్న సుమారు వెయ్యి పోస్టుల్లో కూడా న్యాయపరంగా ఎస్జీటీలకు పదోన్నతి కల్పించే అవకాశం ఉన్నప్పకీ సంఘాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

హెచ్‌ఎం పోస్టుల కోసం ఎదురు చూపు..

గతంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 10వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేస్తే కొంతవరకైనా తమ సమస్యలు తీరుతాయనే భావనలో ఎస్జీటీలు ఉన్నారు. అలాగే ఉన్నత పాఠశాలల మాదిరిగా ప్రాథమిక పాఠశాల్లో కూడా పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేస్తే బోధనేతర పనులు చూసుకోవడానికి వీలు కలుగుతుందని, తద్వారా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాబోధన మీద దృష్టిపెట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. 20 నుంచి 30 ఏళ్ల నుంచి పనిచేస్తూ ఎలాంటి పదోన్నతులకు నోచుకోని ఎస్జీటీలకు ప్రతీ పాఠశాలలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్టులు ఇవ్వడంవల్ల పదోన్నతుల అవకాశం పెరిగి సంతృప్తి చెందుతారని భావిస్తున్నారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే మంచిర్యాల జిల్లాలో దాదాపు మరో 150 మంది వరకు ఎస్జీటీలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 10వేల పోస్టులు మంజూరు చేసి ఎస్జీటీలకు న్యాయం చేయాలని,ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి...

అల్ల రాజేందర్, సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి



గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వెంటనే పదివేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి. ఈ పోస్టులను అర్హతగల అందరు ఎస్జీటీలకు కేటాయించాలి. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సుప్రీం కోర్టులో కేసు వేయడం ద్వారా న్యాయ వివాదాలను పరిష్కరించాలి. అప్‌గ్రేడ్ అయిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల్లో జీవోలు సవరించి ఎస్జీటీలకు పదోన్నతులకు అవకాశం కల్పించాలి.

పింఛన్ డిమాండ్ల సాధనకు ప్రతీఒక్కరు పోరాడాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

చెన్నూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పింఛన్ డిమాండ్ సాధన కోసం ప్రతీ ఒక్కరు పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పట్టణంలోని మార్వాడీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మహాగర్జన సన్నాహక సదస్సులో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగులకు ఆరువేల రూపాయలు, వృద్ధులు, వితంతువులు, చేయూత పింఛన్‌దారులకు నాలుగువేల రూపాయల పింఛన్‌ను అందించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 9న హైద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వికలాంగులు, చేయూత పింఛన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలన్నారు. అనంతరం మహాగర్జన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, వికలాంగుల సంఘం నాయకులు, పింఛన్‌దారులు, వృద్ధులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏపీఎంకు సన్మానం

నెన్నెల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లికి బదిలీపై వెళ్తున్న ఏపీఎం విజయలక్ష్మిని బుధవారం నెన్నెలలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఆమెను ఘనంగా సన్మానించారు. వివిధ శాఖల అధికారులు, నాయకులు, మండల సమాఖ్య సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు తరలిన నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మెడ్చల్ జిల్లాలో జరిగిన సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలకు బుధవారం బెల్లంపల్లి పట్టణం నుంచి నాయకులు పెద్దఎత్తున బయలుదేరారు. నాయకులు సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటస్వామి, సీనియర్ నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య, నాయకులు దాగాం మల్లేశ్, బాపు, రాజమౌళి, బొల్లం పూర్ణిమ, లక్ష్మీనారాయణ, కొండుబానేష్ ఉన్నారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూరు/జైపూర్ ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గణేష్ మండపాల నిర్వహకులు నియమ నిబంధనలు పాటించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశంలో, జైపూర్ ఏసీపీ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వహకులు ముందుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చి అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. సమావేశంలో సీఐ దేవేందర్ రావు, ఎస్‌ఐ సుబ్బారావు, విద్యుత్, మున్సిపల్ అధికారులు, ఉత్సవకమిటీ, మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: గత ఏడాది గణేష్ ఉత్సవాల్లో గొడవలకు కారణమైన వ్యక్తులను టూటౌన్ ఎస్‌ఐ కిరణ్ కుమార్ తహసీల్దార్ ఎదుట బుధవారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను, ప్రశాంత వాతవరణంలో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

మందమర్రిటౌన్/కోటపల్లి/భీమిని/నస్పూర్/భీమారం/దండేపల్లి: త్వరలో ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండప ఏర్పాట్ల నిర్వహకులు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని పోలీసులు సూచించారు. మందమర్రి, కోటపల్లి, భీమిని, నస్పూర్, బెల్లంపల్లి, భీమారం, దండేపల్లిలో గణేష్ మండపాల నిర్వహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మందమర్రి సీఐ శశిదర్‌రెడ్డి, చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, తాండూర్ సీఐ దేవయ్య, ఎస్సైలు విజయ్‌కుమార్, ఉపేందర్‌రావు, శ్వేత, తహసీనోద్దీన్, నిర్వాహకులు పాల్గొన్నారు.

మరమ్మతులపై సింగరేణి యాజమాన్యం దృష్టి

తాండూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ పంచాయతీ పరిధిలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనల మరమ్మతులపై సింగరేణి యాజమాన్యం దృష్టి పెట్టింది. బుధవారం గోలేటి ఏరియా వర్క్‌షాప్ ఏజీఎం కృష్ణమూర్తి, ఎస్ఈ నరేష్, బెల్లంపల్లి ఓసీపీ 2 మేనేజర్ మహేష్‌లు భీమన్నవాగు, లచ్చుగూడెం వాగులను పరిశీలించారు. లచ్చుగూడెం వద్ద ఇనుప బ్రిడ్జిని ఏర్పాటు చేసేలా చూస్తామని తెలిపారు. భీమన్న వాగులో పేరుకుపోయిన పూడికను నీటి ప్రవాహం తగ్గగానే తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కోసం ఉద్యోగులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తూ క్వార్టర్ లేని ఉద్యోగులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో 342 క్వార్టర్లకు కౌన్సెలింగ్ ఏర్పాటు చేయగా, 59 మంది ఉద్యోగులు క్వార్టర్లు తీసుకున్నారు. కార్యక్రమంలో డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలక్రైం,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఖాన్ అకాడమి శిక్షణ తరగతులను ఐఐటీ, నీట్ తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో అధ్యాపకులకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేద్దాం

జన్నారం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న బీసీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేద్దామని బీసీ సంఘం, బీసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ నర్సయ్య, నాయకులు పోడూరి చంద్రయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

రోగులకు నాణ్యమైన మందులు అందించాలి

లక్షెట్టిపేట, ఆగస్టు, 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వచ్చిన రోగులకు నాణ్యమైన మందులు అందించాలని జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు అన్నారు. పట్టణంలోని ఐబీలో బుధవారం ఏర్పాటు చేసిన మెడికల్ దుకాణదారుల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడికి సన్మానం

బెల్లంపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): టీబీజీకెఎస్ గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్‌ను నియమించడంతో బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు సన్మానించారు. కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న ఈశ్వర్‌ను నియమించడాన్ని స్వాగ తిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల ఎర్రగుంట చెరువును గండి కొట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. బుధవారం ఎంసీపీఐయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ లబ్ది కోసం ఎర్రగుంట చెరువుకు గండికొట్టారని దీంతో ఎంతో మంది రైతులు పంటలు నీట మునిగాయన్నారు. చెరువులో చేపలు పెంచుకొని ఉపాధిపొందే మత్స్యకారులు రోడ్డు పై పడ్డారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు మత్తడిని జేసీబీలతో కూల్చి గండి కొట్టడమే కాకుండా చెరువును ధ్వంసం చేస్తున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఎర్రగుంట చెరువుపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్ పాల్గొన్నారు.

మంచిర్యాల గడ్డపై బీసీ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మంచిర్యాలక్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల గడ్డపై బీసీ జెండాను ఎగురవేస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మంచిర్యాల పట్టణంలో బహుజనుల రాజ్యాధికార సాధనకై నేను సైతం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీసీ నినాదానికి స్థానిక ఎమ్మెల్యే భయపడి సభను అడ్డుకునేందుకు ప్రయత్నించారన్నారు. కొందరు నాయకులు సీట్ల కోసమే పార్టీలు మారుతున్నారని విమర్శించారు. పార్టీలు మారినంత మాత్రాన వారి స్వభావం మారదన్నారు. బీసీ రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని విమర్శించారు. బీసీలపై ప్రేమ ఉంటే 18 మంత్రి పదవుల్లో తొమ్మిది కేటాయించి బీసీలపై ఉన్న మమకారాన్ని నిరూపించుకోవాలన్నారు. రాజకీయంగా కాకుండా ఉద్యోగ అవకాశాల్లో కూడా 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఇప్పటికీ ఒక్కసారి కూడ బీసీ ఎమ్మెల్యే కాలేదని బీసీలందరూ ఒక్కతాటిపైకి వచ్చి బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వార్డు మెంబర్లు కూడా రావులను, రెడ్లను గెలువనీయమని హెచ్చరించారు. తనపై అత్యాయత్నం చేసినప్పటికీ ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ కోఆర్డినేటర్లు హరిశంకర్‌గౌడ్, వడ్డే జాదవ్‌యాదవ్, నర్సగౌడ్, శంకర్, ఊసన్న, రామన్న, ముకేశ్‌గౌడ్, రాధిక, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేటర్లు కేబుళ్లను సక్రమంగా ఉంచుకోవాలి

మంచిర్యాలక్రైం,ఆగస్టు20(ఆంధ్ర జ్యోతి): కేబుల్ ఆపరేటర్లు, బ్రాడ్ బాండ్ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుళ్లను అస్తవ్యస్తంగా కాకుండా సక్రమంగా ఉంచుకోవాలని మంచిర్యాల సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే సూచించారు. ఆపరేటర్లతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ఆపరేటర్ల కేబుల్స్‌తో కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో విద్యుత్ ప్రమాదం సంభవించిందన్నారు. అస్తవ్యస్తంగా కేబుళ్లు ఉండడం వల్ల బ్రాడ్‌బాండ్ కేబులా, విద్యుత్ కేబులా అనేది అర్థం కాకుండా ఉండడం వల్లనే ప్రమాదం సంభవించిందని ఆపరేటర్లు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈ ఎంఎం కైసర్, ఏడీఈలు వేణుగోపాల్, శ్రావణ్‌రెడ్డి, ఏఈలు శ్రావణ్, సాయిక్రిష్ణ, కేబుల్ ఆపరేట్లు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

బెల్లంపల్లి/మందమర్రిటౌన్/నస్పూర్/జన్నారం ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, జన్నారంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మందమర్రిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



లక్షెట్టిపేటలో..



బెల్లంపల్లిలో.



బెల్లంపల్లిలో.

వైద్య శిబిరం

కన్నెపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్కాపూర్ గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా క్షయ నివారణ అధికారి సుధాకర్ నాయక్ హాజరై మాట్లాడారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా అనుమానించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పలువురికి బీపీ, షుగర్, హెచ్‌ఐవీ,హైపటైటీస్, టీబీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ఎక్స్‌రే కోసం 102 వాహనంలో పంపించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు అనిల్‌కుమార్, జుబేయర్, పంచాయతీ కార్యదర్శి శ్వేత, మాజీ ఎంపీపీ నర్సింగరావు, సీహెచ్‌వో సత్తయ్య, జలపతి, టీబీ సూపర్ వైజర్ శశికాంత్, సూపర్ వైజర్ ఇందిర, ఎంఎల్‌హెచ్‌ఎలు శిరీష, అనూష, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రైతుల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ పోరాటం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జైపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ఢిల్లీలో కాంగ్రెస్ పోరాటం చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత ఉందని చెప్పడం అవివేకమన్నారు. రైతుల కోసం ఢిల్లీలో పోరాడింది కాంగ్రెస్ ఎంపీలేనని, దీక్షలు చేసిన వారు కూడా వారేనని, బీజేపీ, బీఆర్ఎస్‌నేతలు మాత్రం రైతుల సమస్యలపై మాట్లాడడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం వెంకటేశం, ఆసంపల్లి శ్రీకాంత్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధచూపాలి

లక్షెట్టిపేట, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై గ్రామపంచాయితీ సిబ్బంది శ్రద్ధ చూపాలని లక్షెట్టిపేట మండల అబివృద్ధి అధికారి సరోజ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం లక్షెట్టిపేట మండలంలోని జెండవెంకటాపూర్, బలరావుపేట గ్రామాలను ఎంపీడీవో ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని వార్డులను తిరుగుతూ జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించడంతో పాటు సిబ్బందికి పలు సలహాలు సూచనాలు అందజేశారు. అనంతరం గ్రామంలో నట్ సెంటర్‌తో పాటు అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించి పలు సలహాలు సూచనలు అందజేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ ఆక్టివిటీస్‌పై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

వాగుపై వంతెన నిర్మించాలి



వాగులో నిల్చొని నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు, గ్రామస్థులు

మందమర్రిటౌన్,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 24వ వార్డు ఊరుమందమర్రి రాళ్లవాగు ఉధృతితో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ టీడీపీ దాని అనుబంధ సంఘాల నాయకులు వాగులో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్, నాయకులు జూపాక సంధ్య, నగేశ్, రాజేశ్, సత్యనారాయణ, శ్రీను, రమ, మమత, జ్యోతి పాల్గొన్నారు.

- కూలీలకు ఈకేవైసీ హాజరు విధానం
- ఉదయం, సాయంత్రం ఫొటోలు తీసి యాప్‌లో పెట్టాల్సిందే
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు
- పంద్రాగస్టు నుంచి అమలు


బెజ్జూరులో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు(ఫైల్)

'ఉపాధి'లో కొత్త నిబంధన

ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం పంద్రాగస్టు నుంచి కొత్త నిబంధన అమలు చేస్తోం ది. అదే ఈకేవైసీ విధానం. ఈ నిబంధన ప్రకారం ఉపాధి కూలీలు తమ పని ప్రదేశంలో ప్రతీ రోజు ఉదయం ఓసారి, సాయంత్రం 4 గంటల తర్వాత మరోసారి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

బెజ్జూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పనులకు వచ్చే కూలీల హాజరు నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. కాగా కొందరు నకిలీ ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ నకిలీ హాజరుకు అడ్డుకట్ట వేసేందుకు ఈకేవైసీ విధానం అమల్లోకి తీసుకరావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు 1,23,000 ఉన్నాయి. కూలీల సంఖ్య 2,44,000, క్రియాశీలక యాక్టివ్ కార్డులు 89,000, పని చేస్తున్నవారు 1,65,845మంది ఉన్నారు. ఉపాధి హామీ పథకంలో పనులకు హాజరయ్యే కూలీలు నకిలీ హాజరు నమోదు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. దీంతో పనులకు ఒకరికి బదులు మరొకరు హాజరైన ఘటనలతో పాటు ఒకరి ఫొటోలకు బదులుగా మరొకరి ఫొటోలు అప్‌లోడ్ చేసిన చేసిన ఉదంతాలు వెలుగులోకి వచ్చినట్లు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో చోటు చేసుకున్న నకిలీ హాజరు నమోదు ఘటనలపై సామాజిక తనిఖీల్లోనూ చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. అక్రమ మార్గాల్లో హాజరు వేసుకుని వేతనం పొందిన వారి నుంచి అధికారులు సొమ్ము రికవరీ చేస్తున్నట్లు సమాచారం. నిరుపేద కూలీలకు ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న ఈజీఎస్ పనుల్లో క్షేత్రస్థాయిలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎస్ యాప్ తీసుకవచ్చింది. అయితే ఈ యాప్‌ను కూడా కొందరు దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శులు కొందరు విధులకు గైర్హాజరైనా పాత ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ తమ హాజరు నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. అదే తరహాలో కొందరు ఉపాధి కూలీల హాజరు నమోదు చేసుకున్నట్లు తుర్తించగా, కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు పనులకు హాజరు కాకపోయినా పనులకు వచ్చినట్లుగా యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు అధికారులు గుర్తించారు.

ఉదయం, సాయంత్రం..

కొత్త విధానంలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్లు రెండుసార్లు ఫొటోలు తీస్తారు. ఉదయం పనులకు హాజరయ్యేందుకు వచ్చిన వెంటనే కూలీల ఫొటో తీసి, మరోసారి సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఫొటో తీస్తారు. రెండుసార్లు తీసిన ఫొటోలు ఒకే మాదిరిగా ఉంటేనే ఆ కూలీకి వేతనం మంజూరవుతుంది. లేదంటే వేతనాన్ని నిలిపివేస్తారు. ఈ నెల 15నుంచి ఈకేవైసీ విధానం ద్వారా ఉపాధి హామీ కూలీల హాజరు నమోదు చేసేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. కొత్త హాజరు విధానం అమలుపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఇప్పటికే ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఉపాధి హామీ పథకంలో పథకం కూలీలకు ఈకేవైసీ విధానం ద్వారా హాజరు ఏ విధంగా నమోదు చేయాలనే విషయమై క్షేత్రస్థాయిలో ఉపాధి సిబ్బందికి త్వరలోనే అవగాహన కల్పించనున్నారు.

15 నుంచి అమలులోకి..

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈకేవైసీ హాజరు విధానం 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. కొత్త హాజరు విధానం అమల్లోకి వస్తే నకిలీ హాజరు నమోదుకు అడ్డుకట్ట పడనుంది. అంతే కాకుండా వేతనాల చెల్లింపుల్లో పారదర్శకత ఏర్పడనుంది. నిర్దేశించిన సమయం పని చేసిన కూలీలకే వేతనం లభించనుంది. ఎన్నో ఏళ్లుగా ఉపాధిలో అక్రమాలు జరుగుతున్నాయని పలుసార్లు నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వెల్లడైనా పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోయారు. పని ప్రదేశంలో కూలీలు పని చేయకున్నా చేసినట్లు నమోదు చేసి అక్రమాలు చేశారు. అధికారులు కూడా కొందరు వారికి వంతు పలకడంతో ఉపాధిలో బారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇక నుంచి కొత్త విధానంతో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. పని చేసిన కూలీలే వేతనాలు పొందే అవకాశం ఉంది.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రైబర్ మోడల్ స్పోర్ట్స్ పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం అండర్-14, 16, 18, 20 బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌తెలిపారు.

ఎమ్మెల్యే వైఖరికి నిరసనగా రాజీనామా


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ

కాగజ్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే హరీష్‌బాబు వైఖరికి నిరసనగా బీజేపీకి రాజీనామా చేస్తున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ తెలిపారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బీజేపీలో పదేళ్ల నుంచి కొనసాగుతున్నానని తెలిపారు. జిల్లా అధ్యక్షుడి ఎంపికలో తనకు అన్యాయం చేశారని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమిటీలో కూడా తమకు సమాచారం లేకుండా ఇష్టారాజ్యంగా పదవులు కేటాయించారని అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు, సీనియర్ నాయకులకు ఏ ఒక్కరికి జిల్లా కమిటీలో చోటు కల్పించలేదని తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధిష్ఠానానికి పంపించానని అన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. సమావేశంలో బీజేపీ నాయకుడు గోలేం వెంకటేష్, దళిత మోర్చా సభ్యుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ తెలంగాణ కమిషనర్ ఆదేశాల మేరకు 2025-26 సంవత్సరానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం బుధవారం కలెక్టరేట్‌లో లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. తిర్యాణి మండలం సుంగాపూర్‌కు చెందిన రాంటెంకి ఆధవీక హారని ఎంపిక కాగా జుముడి రుహాపనే, పెరుగు క్రియ అనిరుధ్‌లు ఆ తరువాత స్థానాల్లో వెయిటింగ్ లిస్టులో ఉన్నట్లు అదనపు కలెక్టర్ డేవిడ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ పాల్గొన్నారు.

వాంకిడి ఎస్సైగా మహేందర్


మహేందర్

వాంకిడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వాంకిడి ఎస్సైగా డి మహేందర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ప్రశాంత్ ఆసిఫాబాద్ వీఆర్‌కు బదిలీ కాగా ఆసిఫాబాద్ వీర్‌లో విధులు నిర్వహిస్తున్న మహేందర్ వాంకిడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఖాన్ అకాడమి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ కమిటీ సభ్యుల బంధువులకే ఇళ్లు'

వాంకిడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ కమిటీలో ఉన్న సభ్యులు తమ బంధువులకే ఇళ్లు మంజూరు చేశారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుల్లో ఒకరైన మండోకర్ అనిల్ బంధువు అయిన మండోకర్ బాగుబాయి, ఖమాన గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడైన మొహర్లె గంగాధర్ భార్య భాగ్యశ్రీ, రత్నం నాగమణి, గోయగాంలో సభ్యుడు మడపతి సీతరాం కోడలు మడపతి సంగీతకు ఇల్లు మంజూరు చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల్లోనూ పలువురు నిరుపేదలు ఉన్నారని చెప్పారు. మరి అలాంటి నిరుపేదలకు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు నరేష్, గొల్ల, సోమేశ్వర్, సదాశివ్, నరేందర్, అక్షయ్‌కుమార్, సంజు, వికాస్, వానేష్, గణేష్, కార్తీక్, శ్రీకాంత్ పాల్గొన్నారు

మళ్లీ ఉప్పొంగిన పెన్‌గంగా

సిర్పూర్(టి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సిర్పూర్(టి) మండలంలోని హుడ్కిలి, వెంకట్రావుపేట సమీపంలో పెన్‌గంగా ఉధృతంగా ప్రవహించింది. వంతెన పైనుంచి నీరు ప్రవహించడంతో రాక పోకలు నిలిచి పోయాయి. వంతెనల సమీపంలో ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పని భారం తగ్గించాలని వినతి

కౌటాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అధిక పని భారం తగ్గించాలని బుధవారం ఏపీఎం వినేష్‌కు వీవోఏలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, దత్తు, రవి, మహేశ్వరి, భీంరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు

వాంకిడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం ఖమాన గ్రామంలోని లోలెవల్ వంతెన పక్కన అప్రోచ్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదకు కోతకు గురైంది. ఐదు రోజుల నుంచి రాక పోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అప్రోచ్ రోడ్డును మరమ్మతులు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులకు, మండలాధికారులకు స్థానికులు విన్నవి స్తున్నప్పటికీ స్పందించడం లేదు. ప్రజల ఇబ్బందులను గమనిం చిన స్థానిక రైతు లోబడే పెంటు తన సొంత ఖర్చులతో ట్రాక్టర్ ద్వారా మొరం వేయించి మరమ్మతులు చేయించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నాపూర్‌లోని సిద్ధ మహాయోగ పీఠ ధర్మసేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించే పరమ హంస సద్గురు పూలాజీ బాబా జన్మదిన మహోత్సవ పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థాన అధ్యక్షుడు కేశవ్ దాదా, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగి గులాం వారసులకు వచ్చిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో జీఎం చెక్ అందజేశారు. కార్యక్రమంలో డీవైపీఎం ఎస్‌వీ రాజేశ్వర్‌రావు, ఏఐటీయూసీ నాయకుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై దృష్టి


విద్యార్థుల చేత పాఠాలు చదివిపిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

జైనూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని మార్లవాయి బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థులు, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, మాజీ మంత్రి ఐకేరెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్కతో కలిసి అల్పాహారం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావ్ విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. వాటిని సరియైన రీతీలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు హైమన్ డార్ఫ్ దంపతుల సమాధుల వద్ద మంత్రి నివాళులు అర్పించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, మాజీ సర్పంచ్ కనక ప్రతిభ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, సీఐ రమెష్, ఎస్సై రవికుమార్, సార్మేడి జుగునాక దేవరావ్, మాజీ ఉప సర్పంచ్ జుగునాక సావిత్రి బాయి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు పాఠాలు తప్పుడా చదువడంతో విద్యాశాఖ అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం అల్పాహారం తీసుకున్న అనంతరం మంత్రి విద్యార్థులకు గణిత శాస్త్రంలో ప్రశలు అడిగారు. పాఠాలను చదివిపించారు. కానీ విద్యార్థులు పాఠాలు చదవడానికి తడబడ్డారు. కొందరు తప్పులు చదువుతుండడంతో మంత్రి అధికారులపై సీరియస్ అయ్యారు. విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం కోట్ల రుపాయలు ఖర్చు చేస్తుందని అన్నారు. ఇక్కడేమో విద్యార్థులు సరిగ్గా పాఠాలు చదవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్థులతో మంత్రి సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్లవాయిలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి జూపల్లి కృష్ణారావ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి పులాజీబాబా జన్మదిన మహోత్సవం కర పత్రాలను విడుదల చేశారు.

మంత్రికి వినతులు

జైనూర్, (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మండల నాయకులతో కలిసి బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఆసిఫాబాద్ నుంచి జైనూరు మీదుగా ఉట్నూరు వరకు వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని, మరమ్మతుల చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జైనూరు పీహెచ్‌సీలో వైద్య పోస్టులను భర్తీ చేసి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జామ్ని నుంచి పంగిడి, ధబోలి, పాట్నాపూర్, చోరెపల్లి, జాములధారా రోడ్డుకు మరమ్మతు కోసం నిధులు మంజురు చేయాలని వారు కోరారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు బస్టాండ్ ప్రాంతంలోని గాంధీ, జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సాకడ ఎక్స్ రోడ్డు వద్ద కుమరం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్ అహ్మద్‌తో పాటు అధికారులు తదితరులు ఉన్నారు.

ముంచెత్తిన ప్రాణహిత వరద


బెజ్జూరులో పంటలను ముంచెత్తిన ప్రాణహిత బ్యాక్‌వాటర్

బెజ్జూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత నదికి మరోసారి వరద పోటెత్తడంతో తీర ప్రాంతాల్లోని పత్తి పంట వరద నీటిలో మునిగిపోయింది. మండల సరిహద్దులో ప్రవహిస్తున్న ప్రాణహిత నది మహారాష్ట్రలోని ఎగెవ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నదికి భారీగా బ్యాక్ వాటర్ రావడంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. దీంతో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట మరోసారి నీట మునగడంతో తీర ప్రాంత రైతులకు తీరని నష్టం మిగిల్చింది. ఇప్పటికే ప్రాణహిత నదికి వరద రూపంలో పత్తి పంటను ముంచెత్తగా మరోసారి వచ్చిన వరద కారణంగా కష్టం కన్నీటి పాలైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాక్ వాటర్ కారణంగా తలాయి, పాపన్నపేట, గ్రామాల మధ్య రాక పోకలు స్తంభించి పోయాయి.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది నిండుకుండలా ప్రవహిస్తోంది. ఎగువన మహారాష్ట్రలోని కురిసిన భారీ వర్షాలకు వరదనీరు రావడంతో ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణహిత పుష్కర ఘాట్‌ను తాకుతూ ప్రవహిస్తోంది. మరో నాలుగు మెట్లను తాకితే పుష్కర ఘాట్ పూర్తిగా మునిగి పోతుంది. ప్రాణహిత నిండుకుండలా ప్రవహిస్తూ ఉండడంతో సందర్శకులు నది అందాలను వీక్షిస్తున్నారు. ప్రాణహిత, వార్ధా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

జాలువారుతున్న జలపాతం


జాలువారుతున్న సమ్మక్క జలపాతం

బెజ్జూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జూరు అటవీ రేంజ్ పరిధిలోని ఇందర్‌గాం బీట్ పరిధిలోని సమ్మక్క-సారలమ్మ అటవీ ప్రాంతంలో జాలువారుతున్న జలపాతం సందర్శకులకు కనువిందు చేస్తోం . పచ్చని అడవులు, ఎత్తైన గుట్టలు, పక్షుల కిలకిల రావాల మధ్య జాలువారుతున్న జలపాత దృశ్యాలు సందర్శకులకు కనువిందు చేస్తున్నా యి. మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమ్మక్క జలపాతాన్ని తిలకించేందుకు ఆయాగ్రామాల ప్రజలు తరలివస్తున్నారు.

వయోజనులకు విద్యనందించాలి



మాట్లాడుతున్న జిల్లా వయోజన విద్య కోఆర్డినేటర్ నాగరాజు

కాగజ్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వయోజనులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చాలని జిల్లా వయోజన విద్య కోఆర్డినేటర్ నాగరాజు అన్నారు. సర్‌సిల్క్ ప్రాథమిక పాఠశాల బ్రాంచ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన నవభార్ సాక్షరత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘం సభ్యుల సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా కమ్యూనిటీ అధికారి కటకం మధూకర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ఎంపిక చేసిన కార్యకర్తల ద్వారా వయోజనులకు విద్య నేర్పించేట్లు చూడాలన్నారు. ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ అక్షరాస్యులైన వయోజనులను దూర విద్య విధానం ద్వారా పదవ తరగతి పరీక్షలు రాయించి వారిని పై చదువులకు వెళ్లేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సుందిళ్ల రమేష్, జిత్తు నాయక్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వయోజనులను గుర్తించి వారికి విద్యను అందించాలని ఎంఈవో ప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవ భారత్ సాక్షారత కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిద్దాలనా న్నరు. నాలుగు నెలలు రెండు వందల గంటలు ఈ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. గ్రామ స్థాయిలో నేటి నుంచి కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలలో ఆర్పీలకు, ఉపాధ్యాయులకు ఉల్లాస్‌పై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ పాలొని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, శ్రీదేవి, మధుకర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి), అంధ్రజ్యోతి): వయోజనులు, బడిమానిన విద్యార్థులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో వేణుగోపాలరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నవభారత్ సాక్షరతా ఉల్లాసం కార్యక్రమం ప్రారంభించారు. ఎంఈవో మాట్లాడుతూ బడిమానిన విద్యార్థుల కోసం ఉల్లాసం కార్యక్రమం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన ఆదె వసంత అనే గర్భిణిని బుధవారం ఆసుపత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్ లోనే ప్రసవించింది.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): తేనేటీగల పెంపకంపై ఉచిత శిక్షణ కోసం యువతీ, యువతకులు దరఖాస్తులు జీఎం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలు, వ్యక్తిగత వికాసంపై చింతలమానేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఎంఈవో జయరాజు అవగాహన కల్పించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): ఇటీవల గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న వడ్లూరి రాజేష్ అనే ఉపాధ్యాయుడిని స్థానిక జేత్వాన్ బౌద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గుంతలు పడిన భట్టుపల్లి ప్రధాన రహదారి మరమ్మతు పనులు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చొరవతో ప్రారంభించారు.